ప్రజాశక్తి
మంగళవారం 15 జులై 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు స్వామి, గొట్టిపాటి

తొమ్మిది సార్లు

కరెంటు ఛార్జీలు పెంచింది వైసీపీనే..

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజల అవసరాలకు తగినట్లుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. వ్యవస్థలను విచ్ఛిన్నం చేసి తొమ్మిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచి.. ప్రజలపై భారం మోపింది వైసిపి ప్రభుత్వమే అని విమర్శించారు. కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులో 70 సెంట్ల విస్తీర్ణంలో రూ.3.80 కోట్ల వ్యయంతో 33/11 కె.వి. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి సోమవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ నాలుగైదు నెలల్లోనే ఈ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. దీనివలన కనిగిరి పట్టణంతో పాటు పునుగోడు పారిశ్రామిక ప్రాంతంలో లోవోల్టేజి సమస్య ▶ 2లో

ఇంకా విమర్శలేనా.?

- తామేమి చేశామనే
- దాని కన్నా
- ప్రతిపక్షంపైనే
- అధికార పార్టీ గురి
- రెండో ఏడాది
- వచ్చినా అదే బాటలో
- పాలకపక్షం..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. రెండో ఏడాదిలోకి అడుగుపెట్టారు. ఇంకా వైసిపి పాలనపై విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయని, అన్ని రకాలుగా రాష్ట్రాన్ని దివాళా తీయించారని పదేపదే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పుడు ఇంటింటికీ తిరుగుతున్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరుగుతున్నారు. ఏడాదిలో ఏం చేశామనే అంశాలతో కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమం ముగిసే లోపు ఎక్కడో చోట మీడియా ప్రతినిధులు కలిసి మైకులు పెడుతున్నారు. అక్కడ మంత్రులు మొదలు ఎమ్మెల్యేలు అందరూ ఇపుడు కూడా వైసిపిపైనే విమర్శలు చేస్తున్నారు. ఏడాదిలో ఏం చేశామనే అంశం ప్రాధాన్యత లేకుండా పోతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఐదేళ్ల వైసిపి పాలనపై ధ్వజమెత్తారు. విద్యుత్ ఛార్జీలు పెంచితే బాదుడేబాదుడు అంటూ ఊరూవాడా ప్రచారాలు చేశారు. అప్పట్లో ప్రతిపక్షంగా ఆ పాత్ర సహజమే.. ఇప్పుడు అధికారంలోకి వచ్చారు. అయినా అదే బాటలోనే ఉన్నారు. ఏడాది పాలన ముగిసింది. రెండో ఏడాదిలోకి అడుగుపెట్టారు. ఇప్పుడు కూడా వైసిపిపై విమర్శలు చేస్తే ఉపయోగం ఏమైనా ఉందా? అనేదీ పాలకపక్షం ఆలోచించడం లేదు. రాజకీయంగా పార్టీల మధ్య విమర్శలు ప్రజాసమస్యలపైనే జరగాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు ఎంత మేరకు చేశామన్నదీ ఆలోచించాలి. ప్రజలకు ఇప్పుడు ఏం చెప్పాలో స్పష్టత లేకనే వైసిపిపై విమర్శలు చేస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా ఆలోచిస్తే వైసిపి పాలన బాగాలేదనే భావనతోనే కదా ఓటర్లు కూటమికి అధికారం అప్పగించింది. ఈ విషయం పాలకపక్ష నేతలకు తెలియదా? అంటే ఆలోచించాలి. ఏడాదిలో ఇచ్చిన హామీలు అమలు మొన్నటివరకూ ప్రశ్నార్థకంగానే మారింది. గ్యాస్ సిలిండర్ల పథకం గత దీపావళి నుంచి ఆచరణలోకి వచ్చింది. దాన్నుంచి ప్రభుత్వానికి పెద్దగా స్పందన రాలేదు. గత నెలలో తల్లికి వందనం పథకం అమలు చేశారు. పాలకపక్ష నేతలకు ఊపిరి పీల్చుకునేలా చేసింది. ఇది కూడా లేకుంటే ఇంటింటికీ తిరిగి ఏం చెప్పాలో కూడా అంతుచిక్కని వ్యవహారమే.. ఇంకా రైతులకు పెట్టుబడి సాయం, ప్రతి ▶ 2లో

అనూక్ ఇంటి గోడపై ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ముద్ర వేసిన దృశ్యం

ఫైనాన్స్ కంపెనీలతో

పేదల బతుకులు ఛిద్రం

కిస్తీలు కట్టకపోతే
ఇంటిపై స్వాధీన బోర్డులు

▶ 4లో

న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

చీరాల కుప్పడం చీరకు

జాతీయస్థాయిలో మొదటి స్థానం

న్యూఢిల్లీలో అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా, చీరాల కుప్పడం చీరలు తమదైన ప్రత్యేకతతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో సోమవారం ఘనంగా నిర్వహించిన 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' అవార్డుల ప్రదానోత్సవంలో చీరాల కుప్పడం చీరలు ఎంపికై జిల్లాకు అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నుంచి బాపట్ల కలెక్టర్ జె.వెంకట మురళి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందు కున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర జౌళి, వస్త్ర పరిశ్రమ శాఖ మంత్రి సవిత హాజరయ్యారు. చీరాలలో నేయబడే కుప్పడం సిల్క్ చీరలు వాటి ప్రత్యేకమైన నూలు పనితనం, ఆకట్టు కునే రంగుల శైలి, నూతన డిజైన్లతో విస్తత ఆదరణ పొందుతున్నాయి. ఈ చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల చీరాల ప్రాంతంలోని చేనేత కళాకారులు, నేత కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక చేనేత కళాకారుల సమిష్టి కృషితోనే చీరాల చీరలకు ఈ బ్రాండ్ విలువ ఏర్ప డిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' పథకం ద్వారా స్థానిక సంపదకు జాతీయ ప్రమాణం లభించిందని, ఇది తమ ఉత్పత్తులకు మరింత మార్కెట్‌ను తెరిచే అవకాశం కల్పిస్తుందని చేనేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

బాపట్లలో సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

వంటావార్పుతో

'మున్సిపల్' కార్మికుల నిరసన

- సమస్యలు
- పరిష్కరించకపోతే
- సమ్మె ఉధృతం

▶ 4లో

ఆర్‌టిసి బస్సును ప్రారంభిస్తాం: మంత్రి

ప్రజాశక్తి-బల్లికురవ

అస్తవ్యస్త రోడ్డుతో వైసిపి హయాంలో ఆపిన చెన్నుపల్లి-ముక్తేశ్వరం బస్సును తిరిగి పున ప్రారంభిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో సూపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని అన్ని వర్గాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. తల్లికి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేసి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. నెలాఖరులోగా నియోజకవర్గంలో మూడో విడత సైకిల్లు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. అర్హులైన వితంతువులకు త్వరలోనే పింఛన్లు కూడా అందిస్తా మన్నారు. కార్యక్రమానికి ముందుగా చెన్నుపల్లి వైదన మధ్య రూ.3.75 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును ఆయన ప్రారంభించారు అనంతరం గ్రామంలో అంతర్గతంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు మండలంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

హెచ్‌ఎంలు శిక్షణకు హాజరు కావాలి

ప్రజాశక్తి-పొదిలి

ప్రతి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి ఎం.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నుంచి నాలుగు రోజులు పాటు 17వ తేదీ వరకు జరుగు జిల్లా స్థాయి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమం సోమవారం స్థానిక జోసెఫ్ శ్రీహర్ష ఇంద్రజ మేరీ ఎడ్యుకేషనల్ సొసైటీ కళాశాలలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కోర్స్ డైరెక్టర్‌గా మద్రిపూడి ఎంఈఓ ఇవి రంగయ్య వ్యవహరించగా శ్రీనివాసులు ఈ శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశ్యము, శిక్షకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి డి.నాగరాజు, ప్లానింగ్ కోఆర్డినేటర్ యం.జాలరత్నం, మద్రిపూడి ఎంఈఓ యు.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కరెంటు ఛార్జీలు పెంచింది వైసిపినే..

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కారం అవుతుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటివరకూ 12 సబ్ స్టేషన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలపై ఎలాంటి అదనపు భారం మోపకుండా వారి అవసరాలకు తగినట్లుగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కేశవర్ధన్‌రెడ్డి, డిఎస్‌పి వి.సాయి ఈశ్వర యశ్వంత్, ఎపి సిపిడిసిఎల్ ఎస్.ఈ. కట్టా వెంకటేశ్వర్లు, డిఈ ఉమాకాంత్, ఏఈలు పవన్ కుమార్, ఆర్ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫూర్, జడ్పిటిసి కస్తూరి రెడ్డి, ఎంపిపి దంతులూరి ప్రకాశం పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

కురిచేడు: రైతులకు పగటిపూట నిరంతరాయంగా తొమ్మిది గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. కురిచేడు మండలం కల్లూరు గ్రామంలో 90 సెంట్ల విస్తీర్ణంలో రూ.3.80 కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న 33/11 కె.వి. విద్యుత్ సబ్ స్టేషన్‌కు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామాత్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ 5 నెలల్లోనే ఈ స్టేషన్‌ను పూర్తిచేసి కల్లూరు, కొత్త కల్లూరు, పశ్చిమ నాయుడుపాలెం, కాశీపురం ప్రాంతాల రైతులకు లోవోల్టేజీ లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. దీనికి ముందుగా రూ.2.30 కోట్ల వ్యయంతో నిర్మించే కురిచేడు – దేకనకొండ, మర్లపాలెం రోడ్డుకు కూడా శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాలలో ఉన్నతాధికారులతో పాటు దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నాయకులు పిడతల నేమిలయ్య, గడ్డం బాలయ్య, మాజీ పార్టీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, పావులూరి కోటి లింగయ్య, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ మొగల్ మస్తాన్ వలి, కిలారి కొండయ్య, డాక్టర్ సునీల్, కల్లూరు గ్రామ సర్పంచ్ నక్క రామకృష్ణ పాల్గొన్నారు.

ఇంకా విమర్శలేనా..

(మొదటిపేజీ తరువాయి)

మహిళకూ రూ.1500, నిరుద్యోగ భృతి వంటివి ఆచరణలో కనిపించలేదు. మహిళ లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఆగస్టు 15 నుంచి అని చెబుతున్నారు. ఈ హామీలు అమలుపై జనంలో చర్చగా ఉంది. ఇక జిల్లా హామీలు ఎండమావులుగానే మారాయి. వెలిగొండ ప్రాజెక్టు ఏడాదిలో పూర్తి చేస్తామని ప్రకటించారు. హామీ అమలు కాలేదు. మళ్లీ 2026 నాటికి వాయిదా వేశారు. అప్పటికైనా అవుతుందా? అనేది స్పష్టత లేదు. పశ్చిమ ప్రాంత పాలకపక్ష ఎమ్మెల్యేల్లోనే నమ్మకం కనిపించడం లేదు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చూస్తే ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుం దన్నదే సందేహంగా మారింది. నిర్వాసితులకు ప్యాకేజీలు, పునరావాసం అందలేదు. ఇక మార్కాపురం జిల్లా హామీ కూడా ఇదే పరిస్థితి. జిల్లా డెయిరీ పునరుద్ధరణ, టిడ్కో ఇళ్ల పూర్తిచేసి అప్పగించడం, గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్లస్థలాలు వంటివి అమలు కాలేదు. ఇవన్నీ వదిలేసి నిత్యం మంత్రులు, ఎమ్మెల్యేలు వైసిపి పాలనపైనే విమర్శలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారంలో ఉన్నందున వాటిని సరిచేయాలి. హామీలు అమలు చేయాలి. చేయాల్సిన పాత్రలో ఉన్నప్పుడు ఏం చేయాలో అది చేయకుండా ఇంకా జనం ఓడించిన వైసిపి గురించి మాట్లాడితే ఉపయోగం లేదు. ఏ సమయంలో రాజకీయ విమర్శలు చేయాలి? అనేదీ ఆలోచించాలి. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలి. జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు తేవాలి. వెనుకబాటు గుర్తించినందున ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తే ప్రయోజనం ఉంటుందని గుర్తించాలి.

స్మశాన వాటికను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

కొత్తపేట స్మశాన వాటికను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపేట వాసులు అవసరాలను గుర్తించి స్మశానంలోకి వెళ్లేందుకు రోడ్డు, అంత్యక్రియలు అనంతరం అవసరమైన రూములను నూతనంగా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యల పరిష్కారంకు తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కొత్తపేట పంచాయతీ నిధులతో పాటు పలువురు దాతలు స్వచ్ఛందంగా స్మశాన అభివృద్ధికి సహకరించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్మశాన అభివృద్ధికి సహకరించిన దాతలు, కొత్తపేట పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్మశానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య

18న 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి-దర్శి

ఈ నెల 18న దర్శి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం స్థానిక కురిచేడు రోడ్డులోని పిటిఎస్ కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడుడాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పలువురు నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి దర్శి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

దావా సమన్లు
మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)వారి కోర్టులో
ఓ.యస్.నెం.65/2024

బిట్వీన్:
ఉడతా శివ పార్వతి ....వాది
మరియు
షేక్ జీనతున్నీషా ...ప్రతివాది
టు,
షేక్ జీనతున్నీషా, భర్త.కాలేషా, నివాసం. వెదుళ్ళపల్లి, ప్రస్తుతం మురుకొండపాడు గ్రామం, బాపట్ల (మం & జిల్లా).

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపిబడినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:06-08-2025 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించ బడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:06-08-2025
వనుకూరి వెంకట సుబ్బారెడ్డి, వాది తరపు అడ్వకేట్, జిల్లా కోర్టు ఎదురు, గుంటూరు.

నోటీసు
మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఈ.పి. నెం. 44/2024 ఇన్ ఓ.యస్.నెం. 138/2014
బిట్వీన్ :
Edpuganti Kutumba Rao ..... డిహెచ్‌ఆర్
ఎదిరి
Sunkara Basava Sankara Rao (died) and others .... జెడిఆర్స్
To,
JDR5 : Sunkara Vasundara, D/o Late Basava Sankara Rao, Potharlanka Village, Kolluru Mandal, Bapatla Dist.

పై నెంబరు అమలు పిటీషన్‌లో మీకు శ్రీ కోర్టు మరియు పోస్టు ద్వారాను అనేకసార్లు నోటీసులు చేయించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ మీ హాజరు కొరకు ది. 25-7-2025 తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు అమలు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 25-7-2025
గద్దిపాటి రాంబాబు, ఎన్.హరీష్
డిహెచ్‌ఆర్ తరపు అడ్వకేట్స్ తెనాలి.
సెల్ : 9490224350

ఒరిజినల్ దస్తావేజు పోయినది

ప్రకాశం జిల్లా బూదవాడ గ్రామం చీమకుర్తి మండలం అను వారు కౌశిక్ కుమార్ పులిచర్ల తండ్రి పులిచర్ల పేరయ్య తెలియచేయునది ఏమనగా తేది 06-07-2025న కౌశిక్ కుమార్ పులిచర్ల అను నేను చీమకుర్తి లో బస్టాండు వద్ద జిరాక్స్ షాపు కు ఫోటోస్టాట్ కాపీ తీసుకొనుటకు వెళ్లగా సదరు దస్తావేజు చీమకుర్తి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ తేది:03-01-2019 గల దస్తావేజు నెంబర్ 34/2019 ఒరిజినల్ దస్తావేజు పోయినది. చుట్టుపక్కల వెతికినను దొరకలేదు కనుక ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామా గాని ఫోన్ నెంబర్ గాని తెలియపరచవలసిందిగా కోరుచున్నాను
ఇట్లు
కౌశిక్ కుమార్ పులిచర్ల
తండ్రి : పులిచెర్ల పేరయ్య
బోదవాడ గ్రామం
చీమకుర్తి మండలం
సెల్ నెంబర్ 90114 56113

మహారాజశ్రీ ఒంగోలు మూడవ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టులో
CRP No : 10/2025
కుంచాల సుశీల ...పిటిషనర్
వర్సెస్
కుంచాల యువ కిషోర్‌కుమార్ మరియు ఇతరులు .... రెస్పాండెంట్స్
To
R1) కుంచాల యువకిశోర్ కుమార్, తండ్రి హనుమంతరావు, వయసు 27 సంవత్సరాలు, వద్దె పాలెం,గంగవరపు రోడ్డు, సంతనూతలపాడు గ్రామం మరియు మండలం ప్రకాశం జిల్లా
ప్రస్తుత నివాసం : మద్దిచెట్లపాలెం గ్రామం, బస్టాండ్ సెంటర్, చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా.

పై పిటిషన్‌లో సదరు కోర్టు వారు 1వ రెస్పాండెంట్‌కు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచుండుట చేత పేపర్ ప్రకటనకు ఆర్డర్ వేసి ఉన్నారు. కావున మీనోటీసు నిమిత్తం తేది:21-07-2025కు వాయిదా అయి యున్నది మీరు ఆరోజు ఉదయం 10:30కు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయును లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించబడును
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //
వాయిదా తేది : 21-07-2025
ఇట్లు
MD.యాసిన్
D.ఏడుకొండలు
U.వెంకటేశ్వర్లు
న్యాయవాదులు, ఒంగోలు

ఒరిజినల్ డాక్ మెంట్స్ పోయాయి

శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామానికి చెందిన మాలపాటి ప్రభాకర్‌రెడ్డికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి. ఒంగోలు నుంచి సింగరాయకొండ కు వస్తుండగా టంగుటూరు వద్ద జూనో బేకరీ సమీపంలో మోటార్ బైక్‌లో ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఒంగోలు మంగమూరు రోడ్‌లోని 07-07-2004 కు సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్ 3589 /2004 సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంటు కాగితాలు పోయాయి. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
ఇట్లు
మాలపాటి ప్రభాకర్ రెడ్డి
మూలగుంటపాడు గ్రామం
శింగరాయకొండ మండలం
ప్రకాశం జిల్లా.
సెల్: 7997281965

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS AT ONGOLE, PRAKASAM DISTRICT
ARBITRATION/CHIT FUND/CLAIM PETITION /ARC No.83/ 2024
M/s. Shriram chits (India) Pvt Ltd., formerly known as Shriram Chits Pvt Ltd, Markapur, Branch, Rep by its Manager (Legal) cum GPA Holder. ... DISPUTANT
VERSUS
1. ShaikMeerunisa Begum & 3 others - OPPONENTS
Notice
To,
Opp-3. Shaik Mastan Vali, S/o. Madarvali, aged about 45 years, R/o: D.No:- 3-47, Takaripalem, Thummagunta, PrakasamDist, 523230. - Opponents

Whereas the above named disputant has instituted a claim for recovery of Rs.5,02,655/- (Rupees: Five Lakh two thousand six hundred fifty five only) against you, you are hereby Summoned/ Notice to appear in this Tribunal (Deputy Registrar of Chits) in person on the 29th Day of July 2025 at O/o Dist-Registrar, Ongole, 10:30 A.M. in the forenoon, to answer the claim; and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defense. Take notice that, in default of your appearance on the day before mentioned, the claim will be heard and determined in your absence.
DEPUTY REGISTRAR OF CHITS ONGOLE, PRAKASAM DIST.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

- మూడు కిలోల గంజాయి, 9 గ్రాముల బంగారం, 8 కేజీల వెండి, బైకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సిఐ

వివరాలు వెల్లడిస్తున్న సిఐ హజరత్తయ్య

ప్రజాశక్తి-శింగరాయకొండ

గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడో కిలోల 100 గ్రాముల గంజాయి, 9 గ్రాముల బంగారం, 8 కిలోల వెండి, ఓ బైకును స్వాధీనం చేసుకున్నట్లు శింగరాయకొండ సిఐ సిహెచ్. హజరత్తయ్య, ఎస్ఐ బి. మహేంద్ర తెలిపారు. శింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముఖేష్ కుమార్, గుంటూరు జిల్లాకు చెందిన బడ్డమాను శివారెడ్డి, ఒంగోలుకు చెందిన ట్రంకు కార్తీక్ గంజాయి తరలిస్తుండగా జరుగుమల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వావిలేటిపాడు అడ్డరోడ్డు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముఖేష్ కుమార్ నాలుగు సంవత్సరాలుగా మద్దిపాడులో ఉంటూ జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే లారీ డ్రైవర్లను తక్కువ ధరకు డీజిల్ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక డ్రైవర్ల వద్ద లీటర్ల రూ.5 అదనంగా తీసుకుకొని విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మేదరమెట్ల దగ్గర జాతీయ రహదారిపై హోటల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అందుకు డీజిల్ ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో గంజాయి వ్యాపారం ఎంచుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఒరిస్సా వెళ్లి గుర్తుతెలియని వారి వద్ద నుంచి గంజాయి కిలో రూ.10 వేల వంతున కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లు తయారు చేసి ప్యాకెట్ రూ.200 నుంచి రూ. 500 మేదరమెట్ల, ఒంగోలు చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శివారెడ్డి, కార్తీక్‌తో పరిచయం పెంచుకున్నట్లు తెలిపారు. అనంతరం వారికి తన వద్ద గంజాయి ఉందని చెప్పి కిలో రూ.12 వేల విక్రయించేలా ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో శివారెడ్డి, కార్తీక్ తమకు చెరో కిలో గంజాయి కావాలని చెప్పారన్నారు. దీంతో ముఖేష్ కుమార్ ఒరిస్సా నుంచి మూడు కిలోల 100 గ్రాముల గంజాయి తీసుకొచ్చినట్లు తెలిపారు. శివారెడ్డి, కార్తీక్‌కు ఫోన్ చేసి జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామంలోని క్రాస్ రోడ్డు వద్దకు వచ్చి గంజాయి తీసుకెళ్లాలని చెప్పినట్లు తెలిపారు. దీంతో శివారెడ్డి, కార్తీక్ బైకుపై వచ్చి గంజాయి తీసుకుంటుండగా పోలీసులు రావడాన్ని గమనించి పారిపోయేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. అయితే పోలీసులు వారిని వెంబడించి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి మూడు కిలోల 100 గ్రాముల గంజాయి , రూ.81 వేల విలువైన తొమ్మిది గ్రాముల బంగారం, ఎనిమిది లక్షల విలువైన వెండి 8 కిలోల వెండి కడ్డీలు, బైకును స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెం చెందిన నిందితుడు బండ్లమాను శివారెడ్డిపై 65 కేసులు ఉన్నట్లు కేసులు ఉన్నట్లు వారు తెలిపారు.గంజాయి తరలిస్తున్న వ్యక్తులను చాకచక్యం పట్టుకున్న సిఐ హజరత్తయ్య, ఎస్ఐ మహేంద్రకు ఎస్‌పి దామోదర్, ఒంగోలు డిఎస్‌పి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-కొండపి

కోడి పందాల స్థావరంపై దాడులు నిర్వహించి 8 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. వారి వద్ద రెండు కోడి పుంజులు, రూ. 5600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రమైన కొండపిలో జాళ్లపాలెం వెళ్లే దారిలో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా జూదం తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు వేలం కేంద్రానికి జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 865 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 679 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల 186 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ. 160, సరాసరి ధర రూ. 220-75 పైసలు పలికింది. వేలంలో 18 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రానికి క్లస్టర్ పరిధిలోని ధర్మవరం, కోయవారిపాలెం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకటకష్ణాపురం చెందిన రైతులు 1,124 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 797 బేళ్ల అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 327 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280,కనిష్ట ధర రూ.160 సరాసరి ధర రూ.220.39 పైసలు పలికింది. వేలంలో 21 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖతార్ దేశంలో వెల్డర్స్ ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఖతార్ దేశంలో వెల్డర్స్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవి తేజ యాదవ్ సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. వెల్డర్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 24 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. అభ్యర్థులు ఐటిఐ లేదా ఐటిసి విద్యార్హత కలిగి, కనీసం నాలుగేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన వారికి టీఐజీ లేదా ఏఆర్సీ మల్టీ వెల్డర్ పోస్టులకు నెలకు రూ.52,000 నుంచి రూ.61,500, టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్ పోస్టులకు రూ.42,500 నుంచి రూ.52,000 వరకు వేతనం పొందవచ్చని తెలిపారు. కాంట్రాక్ట్ కాలం రెండు సంవత్సరాలు అని తెలిపారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సౌకర్యాలు, రవాణా సౌకర్యం, అలాగే స్వదేశానికి ఒకసారి వచ్చి వెళ్లడానికి టిక్కెట్ సౌకర్యం అందుబాటు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పాస్‌పోర్టు, అనుభవం, విద్యాసంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల25 లోపు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8125215216, 9988853335,8712655686, 8790118349, 8790117279 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని కోరుతూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3,000 భృతి చెల్లించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆర్. కరుణానిధి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఖాళీ పోలీసులను భర్తీ చేయాలన్నారు. కనిగిరిలో నిమ్జ్ పరిశ్రమ, దొనకొండలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.రాంబాబు, నగర నాయకులు గోపి, మత్తయ్య, శ్యాంబాబు, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ గనులను సందర్శించిన ఐజి

గ్రానైట్ గనిలో పరిశీలిస్తున్న ఐజి

ప్రజాశక్తి-చీమకుర్తి

పోలీస్ గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి చీమకుర్తి పోలీస్ స్టేషన్ సోమవారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్‌పి దామోదర్, డిఎస్‌పి రావిపాటి శ్రీనివాసరావుతో కలిసి ఐజి పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, స్టేషన్ పనితీరును తనిఖీ చేశారు. అనంతరం ఐజి మాట్లాడుతూ చీమకుర్తి పోలీస్ స్టేషన్ పనితీరు బాగుందన్నారు. పెట్రోలింగ్‌కు అదనపు చర్యలు తీసుకునేందుకు తగు సూచనలు చేశారు. అనంతరం ఆనంద్, ఓరియంట్ గ్రానైట్ గనులను సందర్శించారు. కష్ణ సాయి గ్రానైట్స్ గ్రానైట్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి సిఐ ఎం. సుబ్బారావు, ఎస్ఐ కృష్ణయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక తయారీపై సమావేశం

ప్రజాశక్తి- కొత్తపట్నం

ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక తయారీ కోసం కొత్తపట్నం- 6 గ్రామ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేజర్ సుభాషిణి మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం వల్ల మన ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు తెలిపారు. పెట్టుబడులు తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు ఏసమ్మ, విఓఎ ప్రత్యూష , మహిళా సంఘాల సభ్యులు, ప్రకతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు , రెడ్డప్ప, పట్టపు ఇందిరా, ప్రవీణ్ , సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి -కొత్తపట్నం

కొత్తపట్నంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్, బాలుర- 1 హాస్టల్‌లో అన్ని కులాల వారికి 3 వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభించినట్లు హాస్టల్ వార్డెన్ అరుణ కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. బాల.బాలికలకు వేర్వేరుగా ప్రభుత్వ భవనాలు కార్పొరేట్ సంస్థలకు దీటుగా మెరుగైన వసతులతో రూపురేఖలు దిద్దుకున్నాయి. విద్యార్థులకు సన్న బియ్యం, పౌష్టిక విలువలతో కూడిన మెనూను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్యం దష్ట్యా డాక్టర్ల పర్యవేక్షణ, నిరంతరం వార్డెన్ల సంరక్షణ. ప్రతిరోజు ట్యూటర్‌తో స్టడీ అవర్ సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పచ్చని చెట్లు నరికివేత

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఈదుమూడి శ్మశాన వాటికలోని పచ్చని చెట్లు సోమవారం నరికి వేశారు. అందిన వివరాల ప్రకారం.. 2015-2016లో మనం-మనఊరు (మన ఈదుమూడి) సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్మశానవాటిక ప్రహరీ నిర్మించారు. కాంపౌండ్ లోపల గానుగ, వేప, తురాయి మొక్కలు నాటారు. ట్యాంకర్ల ద్వారా నీరు పోసి పెంచారు. అవి ప్రస్తుతం బాగా పెరిగి పచ్చదనం, నీడను అందిస్తున్నాయి. అయితే విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్నాయన్న నెపంతో విద్యుత్ అధికారులు తొలగించారు. విద్యుత్ లైనను అడ్డుగా ఉన్న కొమ్మలు కాకుండా మొదలు వరకు చెట్లను యంత్రాల సహాయంతో తొలగించారు. పచ్చదనం, నీడను ఇచ్చే చెట్లను తొలగించడం ఏమిటని మనం-మనఊరు(మన ఈదుమూడి) సేవాసంస్థ వ్యవ స్థాపకులు కావూరి వాసు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వాసు తెలిపారు.

మొదలు వరకూ నరికి చెట్టు

వైసిపికి రాజీనామా

ప్రజాశక్తి-శింగరాయకొండ

టిడిపి కోవర్టులుగా పనిచేసిన వారికి వైసిపిలో పదవులు రావటానికి నిరసనగా తాము తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు శింగరాయకొండ మండల శానంపూడి గ్రామ వైసిపి నాయకులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల ఎస్‌సి సెల్ మండల మాజీ అధ్యక్షుడు పంతగాని నరసింహారావు, సచివాలయ మాజీ కన్వీనర్ మాదాల నారాయణ, శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు ఆగిపోగు మాలకొండయ్య, సచివాలయ మాజీ కన్వీనర్ అడక శ్రీరాములు వైసిపి యువ నాయకులు మాదాల శివ తాము వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. టిడిపి కోవర్టులుగా పనిచేసిన వైసిపిలో పదవులు అప్పజెప్పడం సిగ్గుచేటు అన్నారు. మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్ కోవర్టుల మాటలు నమ్మి గతంలో పార్టీ కోసం కష్టపడిన వైసిపి కార్యకర్తలను దూరం చేస్తున్నారని తెలిపారు. అందుకు నిరసనగా తాము పదవులు, వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న గోత్రం నారాయణ

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు మండల పరిషత్ జిసి పాఠశాల, హెచ్‌సి పాఠశాలకు చెందిన 52 మంది 1 నుండి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఏడాదికి సరిపడు నోట్ పుస్తకాలు స్థానిక అయ్యప్ప సాయిరాం స్వీట్ హౌస్ అధినేత గాత్రం నారాయణ ఉచితంగా సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను స్వీట్ షాపు వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంలో తన కుటుంబ ఖర్చులు పోను మిగిలిన సొమ్మును విద్యార్థులు, పేదలకు ఏదో రూపంలో సహాయం చేయాలనే దృక్పథంతో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ నీలం దేవరాజు, సర్పంచ్ బొజ్జ రవి, వి శివ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు వి సురేష్ కుమార్, జెపి పున్నయ్య, ఎం కృష్ణప్రియ, లక్ష్మీ పాల్గొన్నారు.

జెఎన్టీయూ అనుమతి పత్రాన్ని చూపుతున్న దృశ్యం

సెయింట్ ఆన్స్‌లో పరిశోధనలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స ఇంజినీరింగ్ కాలేజీలో కాకినాడ జెఎన్‌టియు పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు పరిశోధన కేంద్రం అనుమతి లభించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కళాశాల్లో ఐదు విభాగాల్లో పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు అనుమతి లభించినట్లు ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. సివిల్, మెకానికల్, ఇఇఇ, ఇసిఇ, సిఎస్ఇ విభాగాల్లో పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు అనుమతి లభించినట్లు తెలిపారు. ఈ అనుమతులు రెండేళ్ల పాటు అమలులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు కల్పించిన ఆధునిక సాంకేతిక విద్యా బోధన సౌకర్యం, అత్యంత అధునిక లేబరేటరి, లైబ్రరి సౌకర్యాలు యూనివర్సిటి పరిశోధనా కేంద్రాల అనుమతులు లభించడానికి దోహద పడినట్లు తెలిపారు.

అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఆనందబాబు

అన్నా క్యాంటీన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక పిహెచ్‌సి పక్కన మానేపల్లి చెరువుగా పిలవబడే స్థలంలో రు.40 లక్షలతో అన్న క్యాంటీన్ నిర్మాణానికి శాసన సభ్యులు నక్క ఆనందబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడానికి సిఎం చంద్రబాబు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి రూ.5లకే భోజనం అందించే విధంగా ఏర్పాట్లు చేశారని అన్నారు. గత ప్రభుత్వం ఆ క్యాటిన్లను మూసేసి పేదల నోరు కొట్టిందని ఆరోపించారు. తిరిగి తాము క్యాంటిన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి భాను గంగాధర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, వంగా సాంబిరెడ్డి, జడ్పీటీసీ తిరువీధల ఉదయ్ భాస్కరి, టిడిపి అధ్యక్షులు వాకా శేషుబాబు, తహశీల్దారు మేక శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి మాఘ్జీ నాయక్ పాల్గొన్నారు.

వంటావార్పుతో 'మున్సిపల్' కార్మికుల నిరసన

- సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తాం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

చీరాల్లో మాట్లాడుతున్న కె ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - బాపట్ల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని స్వయంగా సిఎం చంద్రబాబుకు రెండు పర్యాయాలు విన్నవించామని సిఐటియు అనుబంధ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు అన్నారు. మంత్రులు, అధికారులకు లెక్కలేనన్ని సార్లు కోరినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద 2వ రోజు కొనసాగుతున్న కార్మికుల సమ్మె శిబిరం వద్ద కార్మికులు వంటా వార్పు నిరసన తెలిపారు. ఈనెల 16 నుండి రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికుల సమస్యలపై సమ్మె సైరన్ మోగించనున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో 17 రోజులు సమ్మె చేసినప్పుడు ఆ రోజు ప్రభుత్వం ఒక హామీ ఇచ్చిందని, ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంపు కోసం 9మందితో కమిటీ వేశారని అన్నారు. ఆ కమిటీ నివేదిక తయారు చేసి ఫైనాన్స్ శాఖకు పంపామని తెలిపారు. కార్మికుల ఎక్స్ గ్రేషియా రూ.5 లక్షల నుండి రూ.7లక్షలకు పెంపు, దహన సంస్కారాలకు రూ.15వేల నుండి రూ.20వేలకు పెంచే ఫైలు టిడిపి అధికారంలోకి వచ్చాక ఫైనాన్స్ డిపార్ట్మెంట్ నుండి వెనక్కి పంపారని అన్నారు. ఆప్కాస్ విధానం ప్రమాదంలో పడేశారని అన్నారు. ఎన్నికలకు ముందు రూ.20వేల జీతాలు ఉన్న ప్రతి కార్మికుడికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని సిఎం చంద్రబాబు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. బెదిరింపులకు భయపడి వెనక్కు తగ్గేదే లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, కె శరత్, సిఐటియు నాయకులు వై భాస్కరరావు, కె నాగేశ్వరరావు, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

చీరాల : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ బాబురావు, ఎం వసంతరావు, ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ జిల్లా కన్వీనర్ చీమటా వీరస్వామి, నాగేశ్వరరావు, సురేష్, వంతగాని ఇమ్మానియేల్, సింగయ్య, క్రాంతి, సాగర్, చాంద్ బాషా, కాంతారావు, కట్టా విల్సన్, బత్తుల విశ్వేశ్వరరావు, ప్రభాకర్, గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

రేపల్లె : ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తాంమని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమా మహేశ్వరరావు హెచ్చరించారు. సమ్మె సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మణిలాల్, సిహెచ్ మజుందార్, డి ప్రభాకరరావు, ఎన్ రవి, కె రాఘవేంద్రరావు, సుబ్బారావు, శ్రీనివాస్, గీత, అనూష, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎం కిరణ్, సిఐటీయు నాయకులు పి మనోజ్, కె రమేష్ పాల్గొన్నారు.

అద్దంకి : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె 2వ రోజు కొనసాగించారు. వంట చేసుకుని నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, పి ఆదాం, వి జాన్, ఉసురుపాటి శామ్యూల్, మారుతి, మార్క్, రాజేశ్వరి, జాషువా, తోట వెంకటేశ్వర్లు, ఎస్‌కె కరీమ్ పాల్గొన్నారు.

రేపల్లెలో మున్సిపల్ కార్మికుల నిరసన

అద్దంకిలో మాట్లాడుతున్న తంగిరాల వెంకటేశ్వర్లు

ఫైనాన్స్ కంపెనీలతో పేదల బతుకులు ఛిద్రం

- అధిక వడ్డీలకు ఇచ్చి ఇబ్బందులు పెడుతున్న కంపెనీలు
- కిస్తీలు కట్టకపోతే ఇంటిపై స్వాధీన బోర్డులు
- గతంలో ఆడవాళ్లను బయటకి లాగి ఇంటికి సీల్..
- యజమాని చనిపోయినా బాకీ చెల్లించాలన్నదే పట్టు
- ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు దళిత యువకులు
- అనుమతి లేని ఫైనాన్స్ కంపెనీలను రద్దు చేయాలి
- ప్రభుత్వమే రుణాలు ఇవ్వాలన్న మహిళా నేత అమలశ్రీ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని బైటమంజులూరు గిరిజన కాలనీకి చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు ఫైవ్ స్టార్ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రూ.3లక్షల రుణం తీసుకుంటే రూ.2.75 లక్షలు మాత్రమే చేతికిచ్చారు. నెలకు రూ.7,356 కిస్తీ చెల్లిస్తున్నాడు. 84 నెలలకు ఇప్పటికి 36 నెలలు కిస్తీ చెల్లించారు. అయితే అతను గత మే 29న గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం ఆధారం కోల్పోయింది. భార్య సీతమ్మ ఈ మూడు నెలలుగా ఆదాయం లేక ఇంటి దగ్గరే దిగులుతో ఉంది. ఫైనాన్స్ కంపెనీ వాళ్ళు మాత్రం 'మీ భర్త చనిపోయిన మా కేం సంబంధం లేదు. మా డబ్బులు మాకు నెలవారి చెల్లించాల్సిందే, లేకుంటే ఇల్లు వేలం వేస్తాం' అంటూ భయ పెడుతున్నారు. వాళ్ల పెట్టే బాధ భరించలేక అధిక వడ్డీకి అప్పు తెచ్చి కిస్తీలు చెల్లిస్తున్నామని తెలిపారు.

ఈ ఇల్లు దళిత కాలనీలోని ఇంటూరి అనూక్ ఇల్లు. అతను ఫైవ్ స్టార్ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలోనే అప్పు తీసుకున్నారు. మూడు నెలలు కిస్తీ చెల్లించలేదని ఆ ఇంటి గోడపై 'ఈ ఇల్లు మా ఆధీనంలో ఉంది. దీనిపై హక్కులన్నీ మావే. ఇల్లు కొనదల్చుకున్న వారు మమ్మల్ని సంప్రదించాలి.' అంటూ గోడపై ముద్రవేశారు. ఇదే విధంగా ఆ కాలనీలో 30 ఇళ్ళపై ఇలాంటి ముద్రలు వేశారు. అప్పుల ఊబిలో కూరుకు పోయిన పేదలు ఎలా బయటపడాలని ఇబ్బందులు పడుతున్నారు. దళిత కాలనీకి చెందిన ఇద్దరు యువకులు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల అప్పు తీర్చలేక ఆత్మహత్యా ప్రయత్నం చేయగా స్థానికులు కాపాడినట్లు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఈ సమస్యపై మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు గొట్టిపాటి అమలశ్రీ గ్రామంలో పరిస్థితులు తెలుసు కునేందుకు శనివారం బైట మంజులూరు వచ్చారు.

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల గుర్తింపు రద్దు చేయాలి

పేదల జీవితాలను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు అస్తవ్యస్తం చేస్తున్నాయని మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు గొట్టిపాటి అమలశ్రీ అన్నారు. 26 ఫైనాన్స్ కంపెనీలు పేదలను ఆకర్షిస్తున్నాయని, అప్పులిచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నాయని అన్నారు. కూలి పనులపై ఆధారపడి జీవించే పేదలు నెలకు రూ.10వేల చొప్పున చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, మైక్రో ఫైనాన్స్ కంపెనీలను రద్దు చేయాలని అన్నారు. గుర్తింపు ఉన్నా ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం వడ్డీలు వసూలు చేయటం లేదని, ఆ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డ్వాక్రా గ్రూపులకు అంతర్గత రుణాలు ఇవ్వక పోవడంతో పేదలు ప్రైవేట్ ఫైనాన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తుందని అన్నారు. బెట్టింగ్ యాప్‌లను, లోన్ యాప్లను నిషేధించాలని, ఆత్మహత్యలకు పాల్పడిన వారి కుటుంబాల అప్పులు రద్దు చేయాలని, వడ్డీ రేట్లు నియంత్రించాలని అన్నారు.

మృతుడు పాలపర్తి వెంకటేశ్వర్లు ఇల్లు

గొట్టిపాటి అమల శ్రీ

ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు

ఐఐఎఫ్ఎల్, బజాజ్ ఫైనాన్స్‌లలో రుణాలు తీసుకున్నానని, ఇటీవల ఆరోగ్యం బాగాలేక, పనులు చేయలేక కిస్తీలు కట్టలేకపోయానని గ్రామానికి చెందిన ఆలూరి ఇమ్మానియేలు చెప్పారు. తమ బాకీలు చెల్లించక పోతే ఇంటికి వచ్చి గోల చేస్తామని, నలుగురిలో పరువు తీస్తామని, రకరకాల బెదిరింపులతో ప్రతిరోజు ఫోనులో హెచ్చరిక మెసేజీలు పంపుతున్నారని, ఏమి చేయాలో అర్థం కావడం లేదని తెలిపారు.

ఎ ఇమ్మానుయేలు

తిన్న తినకపోయిన కట్టాల్సిందే

ఇల్లు బాగు చేయించుకోవడం కోసం ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీలో రూ.2.50లక్షలు తీసుకున్నామని గ్రామానికి చెందిన కయ్యల దిబోరా చెప్పారు. ఈ అప్పుకు నెలకు రూ.7,230 కిస్తీ చెల్లిస్తున్నామని, స్పందన మైక్రో ఫైనాన్స్‌లో రూ.30 వేల రుణం తీసుకున్నామని అన్నారు. వాటిఇక వారానికి రూ.వెయ్యి కిస్తీ కడుతున్నామని తెలిపారు. కేవలం కూలి పనులపై ఆధారపడి జీవించే తమకు ఒక్కోసారి కిస్తీ డబ్బులు అందకపోతే ఫైనాన్స్ కంపెనీ వాళ్ళు భయపెడుతున్నారని, తిన్న, తినకపోయినా డబ్బు చెల్లించాలని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.

కయ్యాల దిబోరా

కాలు విరిగి ఆపరేషన్ చేయించుకున్న...

తాను బేల్దారి పని చేసుకుంటూ జీవిస్తానని, ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ దగ్గర రూ.3లక్షల అప్పు తీసుకున్నట్లు గ్రామానికి చెందిన చింతల నాగార్జున చెప్పారు. ఈ అప్పుకు నెలకు రూ.7350 చెల్లిస్తున్నట్లు చెప్పారు. నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి ఆపరేషన్ చేశారని, ఏడాది పాటు పని చేయకూడదని డాక్టర్ చెప్పారని చెప్పాడు. ఈ నాలుగు నెలల నుండి కిస్తీలు కట్టకపోవడంతో ఇంటికి తాళాలు వేస్తామని, నలుగురిలో ఇబ్బంది పెడతామని భయపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు.

చింతల నాగార్జున

ఎలా తీర్చాలో తెలియడం లేదు

కౌలు వ్యవసాయంలో చేసిన అప్పు తీర్చుకునేందుకు ఫైవ్ స్టార్ ఫైనాన్స్ దగ్గర రూ.2లక్షలు రుణం తీసుకున్నా మని గ్రామానికి చెందిన సధిపోగు నిర్మల తెలిపారు. కీర్తన మైక్రో ఫైనాన్స్ సంస్థ నుండి రూ.50వేలు, స్పందన సంస్థ నుండి రూ.30వేలు తీసుకున్నామని చెప్పారు. వీటన్నిటికీ నెలకు రూ.10వేలు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. పిల్లల ఫీజులకు ఏడాదికి రూ.లక్ష అవుతున్నాయని తెలిపారు. మోటార్ బైకుపై నుండి పడి కాలు తిరగటంతో కూలి పనికెళ్లలేక కిస్తీలు కట్టలేకపో యానని చెప్పారు. దీంతో తమ ఇంటిపై బోర్డు వేశారని, తమ కుటుంబాన్ని అల్లరి పాలు చేసేందుకు ఫైవ్‌స్టార్ సంస్థ ప్రయత్ని స్తుందని తెలిపారు. ఇంటిపై బోర్డు రాయడం తమకు మనోవేధనగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

సందిపోగు నిర్మల

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె సోమవారం రెండో రోజుకు చేరింది. అందులో భాగంగా నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గత ఎనిమిదేళ్లుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు కాలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.వేతనాల పెంపు, సంక్షేమ పథకాల అమలు లాంటి డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశాడు. సిఐటియు నగర ఉపాధ్యక్షుడు తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె మరింత ఉధతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు కె.వెంకట్రావు, మోహన్ రావు, జాలయ్య, ప్రతాప్, నరసింహ, శ్రీదేవి, లక్ష్మీ ప్రసన్న, శివమ్మ పాల్గొన్నారు.

ఒంగోలులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రమేష్

సమ్మెకు సిఐటియు మద్దతు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఏడాది క్రితం జారీ చేసిన జీవో నంబర్ 36 ప్రకారం కార్మికులకు అర్హతలకు అనుగుణంగా స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ హామీ ఇప్పటి వరకూ అమలు చేయకపోవడం వల్లే కార్మికులు సమ్మె చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ ప్యాకేజీలు, ప్రమాదాల్లో మతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా మొత్తాన్ని రూ.7 లక్షలకు పెంచడం, దహనసంస్కారాల ఖర్చులు, విభజన తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమ్మెను విరమింపజేసేందుకు తగిన జీవోలు జారీ చేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరిని వీడి సమస్యలను పరిష్కరించి సమ్మె విరమణకు మార్గం సుగమం చేయాలన్నారు. లేకపోతే సిఐటియు ప్రత్యక్షంగా సమ్మెలో పాల్గొని కార్మికులకు అండగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

చీమకుర్తి : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు గత ఏడు సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదన్నారు. దీంతో వారు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీవో నెంబర్ 36 ప్రకారం స్కిల్డ్ వర్కర్స్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పోరాటం ఉదతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- టంగుటూరు

ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన చెక్కును బాధితుడికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలా వీరాంజనేయస్వామి తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన పత్తిపాటి వెంకట నరశింహంకు రూ.30,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

మండల పరిధిలోని నిడమానూరు గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచి వడ్డిముక్కల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్స్ వారి సహకారంతో మంగళవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ఆయాసం, గుండె దడ, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండడం, తల తిరగడం, ఎడమ చేయి లాగటం, ఎక్కువ కాలంగా బి.పి, షుగర్ ఉన్న వారికి ఖరీదైన గుండె స్కానింగ్ పరీక్షలు , ఇ సిజి 2డి (ఎకో) స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి ప్రకాశం జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ డి. జయ సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. 10వ తరగతిలో చేరదలచిన విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో 9వ తరగతిలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రవేశం కోరే విద్యార్థులు గత సంవత్సరం జూనియర్ ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించిన ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 16 లోపు జిల్లా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

హారికపై దాడి హేయం

ప్రజాశక్తి-కొండపి

ఉమ్మడి కష్ణాజిల్లా జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త రాముపై టిడిపి మూకలదాడి హేయమైన చర్య అని వైసిపి కొండపి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీర వసంతరావు తెలిపారు. బాబు షూరిటీ- మోసం గ్యారంటీ విస్తతస్థాయి సమావేశానికి వెళ్తున్న చైర్ పర్సన్ దంపతులపై టిడిపి రౌడీలు విచక్షణ రహితంగా దాడి చేయడం దుర్మార్గమని తెలిపారు. దాడి సమయంలో అక్కడే పోలీసులు రక్షణ కల్పించకుండా వేడుకగాచూస్తూ ఉండడం అత్యంత దుంధృష్టకరమన్నారు

మాట్లాడుతున్న విద్యుత్ ఇఇ మాకినేని హరిబాబు

విద్యుత్ అధికారుల దాడులు

ప్రజాశక్తి -చీమకుర్తి

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. అధికారులు 45 బందాలుగా ఏర్పడి ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మీటర్లు ఉండి అక్రమంగా విద్యుత్‌ను వినియోగం చేస్తున్న వారు, మీటర్లు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తున్న వారు, అనుమతి కంటే ఎక్కువ లోడు వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. జరిమానాలు విధించారు. మొత్తం 326 కేసులు నమోదు చేశారు. వారి వద్ద రూ.15.5 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఇఇ మాకినేని హరిబాబు మాట్లాడుతూ విద్యుత్ సర్వీసెస్ తనిఖీలు విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని పేర్కొన్నారు. విద్యుత్ చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ విద్యుత్ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హేమలత, డిఇ ఆర్.మోహన్ రావు, జి.పాండురంగారావు, కె. వెంకటేశ్వర్లు, ఎఇలు చంద్రశేఖర రావు, వి.శ్రీనివాసరావు, కోటయ్య, కోటేశ్వరరావు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ శింగరాయకొండ శాఖ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ పంపిణీ చేశారు. శింగరాయకొండ మండలం బింగినపల్లి పంచాయతీ పరిధిలో పెద్దన్నపాలెం, పెద్దపల్లెపాలెం, బింగినిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు రూ. 30 వేల విలువైన రాత పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, టిఎల్‌ఎం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ గుంటక రామలక్ష్మమ్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలను అభివద్ధి చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల కషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యాపరమైన సహకారం అందించుటకు మానవత స్వచ్ఛంద సంస్థ తమ వంతుగా కృషి చేస్తుందన్నారు. విశ్రాంత ఎంఇఒ మహంకాళి నరసింహ రావు మాట్లాడుతూ పాఠశాల అభివద్ధిలో ప్రజల భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు , కోటపాటి నారాయణ, మానవత సభ్యులు ఎంవి.రత్నం, జెవి.సుబ్బారావు, ప్రధానో పాధ్యాయులు అంబటి బ్రహ్మయ్య, రమణారెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు మాలిరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేస్తున్న సేవాసంస్థ సభ్యులు

బాధితులకు ఉచిత న్యాయ సలహాలు అందిస్తాం

హైకోర్టు మహిళా న్యాయవాది మహేశ్వరి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రభుత్వాలు మారినప్పుడల్లా గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న నిర్ణయాల కారణంగా తీవ్ర స్థాయిలో మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్న ప్రజల సౌకర్యార్థం తాము ఉచిత న్యాయ సలహాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు హైకోర్టు మహిళా న్యాయవాది, ఒంగోలు పట్టణానికి చెందిన ఆరిగ మహేశ్వరి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ భూములు, ఇంటి నివేశనా స్థలాలు, పట్టణ ప్రాంతాలలో రాజకీయ దురుద్దేశ్యంతో ఇళ్లను కూల్చి వేయడం, రోడ్ల వెడల్పు పేరుతో ఇళ్లను, ప్రహరీలను కూల్చడం లాంటి సమస్యలు తలెత్తినపుడు న్యాయపరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తామని ఆమె తెలిపారు. పలు రకాల విద్యా బోధన (బిఎడ్, బిపిఎడ్, ఎంఎడ్, ఎంపిఎడ్) కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలపై న్యాయ సలహాలను నేరుగా లేదా ఫోన్ ద్వారా అందిస్తామని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 83746 27976 సెల్ నంబరులో సంప్రదించ వచ్చునని ఆమె పేర్కొన్నారు.

ప్రజా సమస్యలు, భూసమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి భవిష్యత్‌లో అవసరమైతే ఆయా గ్రామాలలోని స్థానికులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి సంయుక్తంగా న్యాయ విజ్ఞాన సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తామని మహేశ్వరి తెలిపారు.

సిఐ హజరత్తయ్యను అభినందిస్తున్న ఎస్‌ఐలు

ఎపి పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'చావా'

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆంధ్రప్రదేశ్ పోలీసుల అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శింగరాయకొండ సిఐ చావా హాజరత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఒంగోలు కెబి రెస్టారెంట్‌లో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐ హజరత్తయ్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హాజరత్తయ్య శింగరాయకొండ ఎస్ఐ బి.మహేంద్ర, జరుగుమల్లి ఎస్ఐ బి.మహేంద్ర, టంగుటూరు ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు, సర్కిల్ పరిధిలోని పోలీసుల సిబ్బంది సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.

కంపెనీలు మోసం చేస్తే.. చంద్రబాబు ఆదుకున్నారు

కొనుగోలు కేంద్రం ప్రారంభ సభలో ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

బర్లీ పొగాకు రైతులను కంపెనీలు నమ్మించి మోసం చేశాయని, రైతుల పరిస్థితి తెలుసుకున్న సీఎం చంద్రబాబు బాధపడ్డారని, రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చి దేశ చరిత్రలో ఎన్నడూ ఎక్కడ లేని విధంగా మొట్ట మొదటి సారి ప్రభుత్వమే బర్లీ పొగాకు కొనుగోలు చేపట్టిందని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రం సోమవారం ప్రారంభించారు. ఆయనకు రైతులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతు ప్రయోజనాల కోసం రూ.273 కోట్లు విడుదల చేసిందని అన్నారు. మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టిందన్నారు. మార్క్ఫెడ్ డిఎం కరుణశ్రీ మాట్లాడుతూ రైతులు సహకరించాలని కోరారు. నిబంధనలు మేరకు పొగాకు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని కాంక్షించే ఏలూరి ఉండటం తమ అదృష్టం అన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏలూరి

కార్యక్రమంలో ఆర్డిఓ పి గ్లోరియా, తహశీల్దార్లు ప్రశాంతి, బ్రహ్మయ్య, టిడిపి మండల అధ్యక్షులు నల్లపునేని రంగయ్య చౌదరి, తాటి నాగేశ్వరరావు, శంషుద్దీన్, తొండపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబు, జనార్ధన్, రజాక్, శ్రీనివాసరావు, రావిపాటి సీతయ్య, కనపర్తి నాగేశ్వరరావు, తారక రామారావు, కె కృష్ణ పాల్గొన్నారు.

యద్దనపూడి : పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఏ ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు ఎన్ రంగయ్య చౌదరి పాల్గొన్నారు.

పర్చూరు : మార్క్ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం మండలం అడుసుమల్లిలో ప్రారంభించారు. కార్యక్రమంలో మార్క్ఫెడ్ డిఎం కరుణశ్రీ, ఎఎంసి చైర్మన్ వెంకట్రావు, ఆర్డీఓ పి గ్లోరియా, తహశీల్దారు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నల్లబర్లీ కొనుగోళ్లు వేగవంతం చేయాలి..

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రైతుల వద్ద అధిక మొత్తంలో నిల్వ ఉన్న నల్లబర్లి పొగాకు కొనుగోళ్లలో చిన్న సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇచ్చి నాణ్యతను బట్టి ధర నిర్ణయించి కొనుగోళ్ల వేగవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎఎంసి ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం మార్క్ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు సమస్యలను ఎంఎల్ఏ దృష్టికి రైతు సంఘం నాయకులు తీసుకెళ్లారు. మండల కేంద్రంలో అలంకారప్రాయంగా ఉన్న ఎఎంసికి పూర్వ వైభవం తెచ్చేలా మార్టూరులో ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని 700 మంది రైతుల వద్ద నిల్వ ఉన్న నల్లబర్లీ కొనుగోళ్లలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇస్తూ కొనుగోళ్ల చేపట్టాలని కోరారు. మార్క్ఫెడ్ ద్వారా మాత్రమే కాకుండా ప్రవేట్ కంపెనీలను కూడా నల్లబర్లీ కొనుగోళ్లలో భాగస్వామ్యం చేస్తే రైతులు పండించిన నల్లబర్లీ పంటకు మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల వైద్యశాలగా మార్చాలని కోరారు. షుగర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు చేయాలని కోరారు. బాపట్ల జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుండి మార్టూరు, వలపర్ల, బల్లికురవ ప్రాంతాల నుండి నిమిత్తం ప్రజల రాకపోకల సౌకర్యం కోసం చీరాల నుండి యద్దనపూడి, మార్టూరు మీదుగా బల్లికురవ వరకు ఆర్టీసీ బస్సు, చీరాల నుండి పర్చూరు, ఇడుపులపాడు మీదుగా నాగండ్ల, కోలలపూడి, కొనంకి, వలపర్ల వరకు మరో బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని రైతు నాయకులు బత్తుల హనుమంతరావు, ఎనికపాటి రాంబాబు, బొడెంపూడి నూరిబాబు, పాలేపు సాంబశివరావు, నాగేశ్వరరావు, ఎన్ సాంబశివరావు, జి మోహనరావు, పి సాంబశివరావు కోరారు.

ఆకట్టుకున్న 'అల్లూరి' జీవిత చరిత్ర బుర్రకథ

ప్రజాశక్తి - యద్దనపూడి

జులై 4న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మండలంలోని అనంతవరంలో బుర్రకథ పితామహుడు షేక్ నాజరు కుమారుడు, జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత షేక్ బాపూజీ కళాబృందంచే సీతా రామరాజు జీవిత చరిత్రను బుర్రకథ ద్వారా చెప్పారు. బుర్రకథకు ముందు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు కావ్య, అనన్య, సాత్విక వందే మాతరత గీతం ఆలపించారు. ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు విజయమ్మ అధ్యక్షత వహించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పంతగాని రమేష్ మాట్లాడుతూ విద్య ద్వారానే పేదల అభివృద్ధి సాధ్యం అన్నారు. ఎస్సిఆర్పి సొసైటీ కన్వీనర్ రాము మాట్లాడుతూ మన ఓటు మనకే వేసుకుని రాజ్యాధికారంలోకి రావాలని అన్నారు. అంబేద్కర్ జ్ఞాన సొసైటి అధ్యక్షులు మైలా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ఐక్యంగా రాజ్యాధికారం సాధించాలని అన్నారు. సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ పేదలకు అన్యాయం చేస్తుందని అన్నారు. ప్రధాన కథకుడు షేక్ బాబూజీ అల్లూరి సీతారామ రాజు జీవిత చరిత్ర చెప్పి ప్రజలను అలరించారు. దయారత్నం, డిఎస్ బాబు, రాజేంద్రప్రసాద్, ఎస్ఏ సలీం బాబు, రాహేలు, వందనం, రవి, రత్న కిషోర్, కిషోర్ బాబు, ఆనంద్, పాల్గొన్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న బుర్రకథకుడు బాపూజీ

ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంఇఒ సుబ్బయ్య

ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక భవిత కేంద్రం నందు ఇద్దరు చిన్నారులకు ట్రై సైకిల్, వీల్ చైర్లను ఎంఇఒ జెవి సుబ్బయ్య, ఐ పురుషోత్తంలు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఇఆర్టీలు ఆర్ శ్రీధర్, ఎస్ ధనలక్ష్మి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నూతలపాడు ఆశ్రయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కువైట్కు చెందిన సేవా సంస్థ నిత్యవసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు బి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ కువైట్ దేశంలో పనిచేస్తున్న ప్రవాసాంధ్రులు మన రాష్ట్రంలోని వృద్ధాశ్రమాలకు, అనాధాశ్రమాలకు తమ వంతు కృషి చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఆశ్రమాలు నిర్వహించేందుకు దాతల సహకారం తప్పనిసరని తెలిపారు. ప్రవాసాంధ్రులు ఏర్పాటు చేసుకున్న బుష్రా హెల్పింగ్ హాండ్స్ ఆశ్రయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రూ.17వేల విలువైన నిత్యావసర వస్తువులు అందజేసినట్లు తెలిపారు. విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపల్ జి సుందరరాజు, ఆశ్రమ బాధ్యులు భవనం శ్రీనివాసరెడ్డి, భవనం జయలక్ష్మి, సంస్థ కో ఆర్డినేటర్ సాయి యజ్ఞ పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

ప్రజా వేదికలో ఆరు వినతులు

ప్రజాశక్తి - రేపల్లె

ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డిఓ ఎన్ రామలక్ష్మి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు అర్జీలు కొత్తగా వచ్చాయని తెలిపారు. వీటిని ఆయా శాఖల అధికారులకు పంపినట్లు తెలిపారు.

తడి, పొడి చెత్త వేరు చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని కొంగపాడు, వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణను ఎంపిడిఒ బి సింగయ్య సోమవారం పరిశీలించారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. నియోజకవర్గం యాక్షన్ ప్లాన్ సమావేశం మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.

'వైసీపీ అంగన్వాడీ' అధ్యక్షులుగా పద్మావతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి అంగనవాడి విభాగం అధ్యక్షులుగా ఎంపీటీసీ కొఠరపు పద్మావతి నియమితులయ్యారు. వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో ఎంపిటిసి కొఠరపు పద్మావతికి పదవిని అప్పగించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను ఎంపిపి డివి లలిత కుమారి, కొఠరపు పిచ్చయ్య శాస్త్రి, ఎంపిటిసిలు నన్నెపాముల చంటి, గద్దె సుశీల, కో ఆప్షన్ సభ్యులు నబి, మల్లేశ్వరరావు, సొంటి కామేశ్వరరావు దుశ్శాలువాతో సత్కరించారు.

17న మృతవీరుల సంస్మరణ సభ

ప్రజాశక్తి - చీరాల

ఈనెల 17న కారంచేడు మృతవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు కారంచేడు బాధిత పోరాట నాయకులు దుడ్డు భాస్కరరావు తెలిపారు. మండలంలోని విజయనగర కాలనీలోని రుద్రక్షేత్రం వద్ద విలేకర్లతో సోమవారం మాట్లాడారు. సమావేశంలో తేళ్ల వెంకటస్వామి, బుడంకుంట్ల లక్ష్మీనరసయ్య, తేళ్ల రాంబాబు, తేళ్ల అశోక్, దుడ్డు రవీంద్ర, తేళ్ల పవన్ పాల్గొన్నారు.

నేడు వెల్లలచెరువులో 'సుపరిపాలన'

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువులో మంగళవారం సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం జరుగుతుందని సొసైటి మాజీ అధ్యక్షులు చింతా శ్రీధర్ బాబు తెలిపారు.

నేడు నల్లబర్లీ కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మేదరమెట్ల

మండలంలోని తమ్మవరంలో ఎస్డబ్ల్యూసి గోడౌన్స్ నందు మంగళవారం మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఎఒ ఎస్ రామ్మోహనరెడ్డి తెలిపారు.

మురళీమోహన్ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మురళీమోహన్కు ఘన సన్మానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు జెడ్పి ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్కు మనం ఫౌండేషన్ నుండి భారత పద్మ ప్రతిభ అవార్డు హైదరాబాదులో అందజేసిన సందర్భంగా పాఠశాల హెచ్ఎం కర్ర అరుణ కుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ కృష్ణానది వరదల సమయంలో లంక గ్రామాల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు చేసిన సేవలు అభినందనీయమని అన్నారు. పాత గ్రంథాలయ మిత్రుల సంఘం స్థాపించి నిరుద్యోగుల కోసం చేసిన సేవలు మరువలేనివని, అవార్డు రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నక్క వెంకటేశ్వర్లు, కె శివరామకృష్ణ, కె కుటుంబరావు, ఎస్తేర్ బాబు, శ్రీనివాసరావు, శైలజ, ఆశలత, వెంకటస్వామి, విజయలక్ష్మి, బేబీ, రాణి, కిషోర్ ఉన్నారు.

బల్లలు ఏర్పాటు చేసిన గ్రామస్తులు

పాఠశాలకు గ్రామస్తుల వితరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెసర్లంక, పల్లెపాలెం పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామస్తులు కలిసి రూ.50వేల విలువైన 8బెంచ్లు, రూ.17 వేల విలువైన స్మార్ట్ టివిని ఉచితంగా అందజేశారు. పల్లిపాలెం పాఠశాల శిథిలావస్థకు చేరి దెబ్బతినడంతో ఎంఇఒ ప్రత్యామ్నాయంగా పంచాయతీ కార్యాలయంలో తరగతి పదులు నిర్వహించే విధంగా ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన భవనంలో విద్యార్థులకు సౌకర్యాలు లేకపోవడంతో గ్రామస్తులు, అంబేద్కర్ యూత్ ఈ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎంఇఒ నీలం దేవరాజు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

గృహాల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో 2014-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ గృహ నిర్మాణాల పెండింగు బిల్లులను వెంటనే చెల్లించాలని సిపిఐ కార్యదర్శి ఖాదర్ బాషా సోమవారం ఎంపిడిఒ జ్యోతిర్మయికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చుటకు సిఎం చంద్రబాబు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ప్రవేశపెట్టారని అన్నారు. కానీ ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. 2019-24లో వైసిపి ప్రభుత్వం పరిపాలనలో బిల్లులు చెల్లించలేదని అన్నారు. లబ్దిదారులు అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టినా బిల్లులు వస్తాయో లేదని అయోమయంలో ఉన్నారని అన్నారు. పెండింగులో ఉన్న ఎన్టీఆర్ ఇళ్లను క్షేత్రస్థాయిలో సర్వే చేసి పెండింగు బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీఎం సహాయనిధి లబ్ధిదారులతో ఆనందబాబు

సీఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - వేమూరు

అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్న పేదలకు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మొత్తం రూ.5,22,297 విలువైన చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - వేటపాలెం

యువతరం క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మండలంలోని చల్లారెడ్డిపాలెంలోని డిగ్రీ కాలేజీ మైదానంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. నియోజకవర్గానికి రూ.3.80 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కీర్తి పూర్ణచంద్రరావు, వెంకటేశ్వర్లు, గొర్ల రాముడు, చప్పుడు వెంకట్రావు, పాలకం శేఖర్ పాల్గొన్నారు.

వినతి పత్రం అందిస్తున్న వైసిపి నాయకులు

కోన ప్రభాకరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

మాజీ గవర్నర్ కోన ప్రభాకారరావు విగ్రహాన్ని స్థానిక పాత బస్టాండు సెంటర్లోనే తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌కు వైసిపి నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి చిన్నపోతుల హరి బాబు, వైసిపి మండల అధ్యక్షులు మరుప్రోలు కొండలరెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య, నాయకులు మచ్చా శ్రీనివాసరెడ్డి, కర్లపాలెం కిషోర్ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని ధర్మవరం పరిసరాల్లోని మట్టి తవ్వకాలను చీరాల ఆర్డీఒ చంద్రశేఖర నాయుడు, మైనింగ్ అధికారి సోమవారం పరిశీలించారు. అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించాడు. ఆయన వెంట తహశీల్దారు జి శ్రీచరణ్, ఆర్ఐ శంకర్, సర్వేయర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ ద్వారానే సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సెల్ ఫోన్ ద్వారానే కార్మికులు సభ్యత్వ నమోదు, రెన్యువల్ చేసుకునే వ్యసులుబాటు ప్రభుత్వం కల్పించిందని కార్పెంటర్స్ అసోసియేషన్ నాయకులు కోడూరు వెంకటేశ్వరరావు తెలిపారు. సెల్ ఫోన్ ద్వారా సోమవారం ప్రారంభించారు. ఎపిఎస్‌సిఎ.కాం ద్వారా సాదారణ సభ్యత్వం, రాష్ట్ర కమిటీ సభ్యత్వం, రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సభ్యత్వం మూడు రకాలుగా ఉన్నాయని తెలిపారు.

ప్రజల కోసం 'ఇంటింటికీ టిడిపి'

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. పట్టణంలోని 4వ వార్డు పేరాల, జక్కావారివీధిలో సుపరిపాలన వార్డు కౌన్సిలర్ గోలి జగదీష్, అధికారులతో కలిసి సోమవారం నిర్వహించారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పెన్షన్ల పంపిణీ, రేషన్ సరఫరా, విద్యుత్, నీటి సమస్యలు వంటి విషయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ అబ్దుల్ రషీద్, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, న్యాయవాది కొమ్మనబోయిన నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు గంజి పురుషోత్తం, కౌన్సిలర్ కె యానాదిరావు, నాయకులు మూర్తి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని ఐలవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. తొలుత బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, టిడిపి అధ్యక్షులు దీపాల ప్రసాదు, అనగాని ఏడుకొండలు, మాచర్ల నాగరాజు, వాకా శేషుబాబు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆనందబాబు

పిజిఆర్ఎస్‌లో డాక్టర్ దేవరాజు ఫిర్యాదు

ప్రజాశక్తి - చీరాల

స్థానిక కలెక్టర్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చీరాల శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు పిర్యాదు చేశారు. తన హాస్పిటల్ రెంట్ అగ్రిమెంట్ వివాదం కోర్టులో ఉండగా భవన యజమాని బుర్ల వెంకట రావు తన రాజకీయ, ఆర్థిక, అంగ బలంతో హాస్పిటల్ ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తూ తనపై అధికారులకు పిర్యాదులు చేస్తూ మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెడుతున్నారని పిర్యాదులో పేర్కొన్నారు. తన హాస్పిటల్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ తనను నైతికంగా దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని అధికారులకు వివరించారు. కోర్టు నిర్ణయం వచ్చేంతవరకు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ద్వారా వైద్య సేవలు అందించుటకు ఎటువంటి ఆటంకాలు లేకుండా, బుర్ల వెంకటరావు అతని బావ పమిడి భాస్కరరావు నుండి రక్షణ కల్పించాలని, అతని పిర్యాదుల ఆధారంగా అధికారుల వేధింపులు ఆపి తనకు రక్షణ కల్పించాలని కోరారు.

అర్జీ ఇస్తున్న చేస్తున్న డాక్టర్ తాడివలస దేవరాజు

బోధనేతర పనులతో విద్యారంగం నిర్వీర్యం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించడంతో విద్యా రంగం నిర్వీర్యం అవుతుందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్టియు కార్యాలయంలో సోమవారం జరిగిన నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగాంధ్ర, మెగా పిటిఎం, అర్జెంటు నివేదికలు వంటి పనులుతో రెండు వారాలుగా బోధనకు ఆటంకం కలిగించారని అన్నారు. యాప్‌ల భారం తగ్గిస్తామని మాటిచ్చి అన్ని పనులు చేయిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా పునరాలోచించి విద్యా ప్రమాణాలు మెరుగుపర్చే దిశగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నూర్ భాషా సుభాని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్టియు పట్టణ అధ్యక్షులు ముక్తేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ రఫీ, ఆర్థిక కార్యదర్శిగా కె రామాంజనేయులు నియమితులయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ వాణి జిల్లా కన్వీనర్ పివి నాగరాజు, సిహెచ్ శ్రీనివాసరావు, పీలా శివాంజనేయులు, గవిని శ్రీనివాసరావు, ఎవి నారాయణ, యడం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇంజనీరు జి ఆంజనేయులు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - పంగులూరు

విద్యుత్ చౌర్యానికి ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవని బాపట్ల సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీర్లు జి ఆంజనేయులు, విజయకృష్ణ హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విజిలెన్స్ ఎఇ ఎం భాస్కరరావు, ఆపరేషన్ డిఇ ఎన్ మస్తానరావు నేతృత్వంలో 29 బృందాలు ఏర్పడి 1527 విద్యుత్ సర్వీసులను పరిశీలించారు. తనిఖీల్లో అనుమతికి మించి విద్యుత్తు వినియోగిస్తున్న 59 మందికి రూ.1,53,200, విద్యుత్తు చౌర్యానికి పాల్పడ్డ ఇద్దరికీ రూ.15 వేలు, అనుమతిలేని కేటగిరీలో విద్యుత్తు వాడుతున్న ముగ్గురికి రూ.18 వేల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి, మార్టూరు డిఇలు ఎం దామోదరం, సురేంద్ర బాబు, విజిలెన్స్ డిఇ విజేంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న చైర్మన్ తేలప్రోలు రమేష్

ఎఎంసి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఈనెల 16న జరిగే నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, నాయకులు చేవూరి వాసురెడ్డి సభా ప్రాంగణాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు కింజారపు అచ్చం నాయుడు, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, డోలా బాల వీరాంజనేయ స్వామి, బాపట్ల ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్, కలెక్టర్ వెంకట కృష్ణ మురళి హాజరవుతారని తెలిపారు. అదే రోజు పొగాకు వేలం కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కొప్పక కొండలు, సన్నెబోయిన ఏడుకొండలు, కోటేశ్వరరావు, కొనికి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజు నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - బాపట్ల


అశోక గజపతిరాజుతో నరేంద్ర వర్మ (ఫైల్ ఫోటో)

తెలుగుదేశం సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడం పట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ హర్షం వ్యక్తం చేశారు. అశోక గజపతి రాజుకు నరేంద్ర వర్మ సోమవారం ఒక ప్రకటనలో హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు దక్కిన ఈ గౌరవం ఉత్తరాంధ్ర ప్రజలకే గాక ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు దక్కుతుందని అన్నారు. ఆయన గవర్నర్ బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని కోరారు.

ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ సాయం

ప్రజాశక్తి - కర్లపాలెం

అగ్నిప్రమాద బాధితులు, ఆపదలో ఉన్న వారికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ అండగా నిలబడుతుందని ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి అన్నారు. మండలంలోని సమ్మెటవారిపాలెంలో సమ్మెట శ్రీనివాసరెడ్డికి చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయి బాధితులు రోడ్డుపై ఉండడంతో రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, కోశాధికారి జోగి సువర్ణ రాజు, మద్దిబోయిన గోపి, నందిపాటి శ్రీరాం సునీల్, బండ్రెడ్డి అకమ్మరావు, యాసం రాజా రమేష్, విన్నకోట శ్రీనివాసరావు, తన్నీరు గోపి పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - వేటపాలెం

గ్రామాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మండలంలోని రామన్నపేటలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉమ్మటి శంకర్రావు, పృథ్వి బాలచంద్రమూర్తి, పల్లపోలు శ్రీనివాసరావు, పోలకం శేఖర్, ఏరాసు బసవేశ్వరరావు, కొత్త నాగు, అచింశెట్టి భానుమూర్తి, ఆవుల అశోక్ కుమార్, ఎంపిడిఒ ఎం రాజేష్ బాబు, వెలుగు ఎపిఎం కాటి అంజిబాబు, సెక్రటరీ ఎన్‌వికె చక్రవర్తి, చప్పడి వెంకటరావు పాల్గొన్నారు.

రాజీమార్గమే ఉత్తమం

ప్రజాశక్తి - అద్దంకి

రాజీ మార్గమే రాజమార్గమని, కక్షిదారులు పంతాలకు పోకుండా కేసులు మధ్యవర్తుల ద్వారా పరిష్కరించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణ నుండి మీడియేషన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాగి చేసుకుంటే ఇరువురు కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు ఆదావుతుందని అన్నారు.

సొసైటీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

సొసైటీ పాలకవర్గానికి సత్కారం

ప్రజాశక్తి - అద్దంకి

ఇటీవల మణికేశ్వరం సహకార సంఘం త్రీమెన్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన కొంగపాడుకు చెందిన నర్రా బ్రహ్మానందం, సభ్యులు షేక్ మస్తాన్ వలి (మణికేశ్వరం), వెలనాటి వీరరాఘవయ్య (వేలమూరిపాడు)ను తెలుగుదేశం ఆధ్వర్యంలో సోమవారం దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మోషే, మాథ్యూస్, రవి, ప్రసాద్, రహీం, రవీంద్ర, తిమోతి, ముస్తఫా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

సాధికార సారథులు ఎంతో కీలకం

మంత్రులు గొట్టిపాటి, స్వామి

ప్రజాశక్తి-కనిగిరి

తెలుగుదేశం పార్టీలో కుటుంబ సాధికార సారథులు ఎంతో కీలకమైన స్థానం కలిగి ఉన్నారని, పార్టీ కార్యక్రమాలను చురుగ్గా చేపట్టి ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో క్లస్టర్, యూనిట్, బూత్, కేఎస్ఎస్ సభ్యులతో సమావేశమయ్యారు. మంత్రులు మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రతి బూత్ వద్ద ప్రతిరోజూ కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. బూత్ ఇన్‌చార్జ్‌లు, కేఎస్ఎస్ సభ్యులు నిర్దేశిత లక్ష్యాలను అదే రోజు పూర్తి చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి చేరి, అభివద్ధి, సంక్షేమంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.కనిగిరి నియోజకవర్గ అభివద్ధి పథంలో వేగంగా దూసుకుపోతుందని, నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వం ప్రస్తావిస్తూ మంత్రులు ప్రశంసించారు. ప్రజలకు అనుకూలంగా అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడం, సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే చురుగ్గా పనిచేస్తున్నారని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కేఎస్ఎస్ సభ్యులకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజలకు మంచి చేసే నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అయితే, కీడు చేసే నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని వారు ఆరోపించారు. ప్రతి బూత్ లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు. కుటుంబ సాధికార సారథులు ప్రజలతో నిత్యం మమేకం కావాలన్నారు. పార్టీ విజయమే లక్ష్యం అని వారు పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆయా మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, కె ఎస్ ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

'ఒంగోలు'ను

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం..

ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పయనిస్తుందని, రానున్న కాలంలో ఒంగోలు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు పేర్కొన్నారు. ఒంగోలు నగరం 28, 29 డివిజన్లలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యమ్రంలో ఎమ్మెల్యే దామచర్ల పాల్గొన్నారు. ఆయా డివిజన్లకు చేరుకున్న ఎమ్మెల్యే దామచర్లకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. 28, 29 డివిజన్లలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాన్ని అందజేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 29 డివిజన్ కొండమిట్ట వద్ద మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 29వ డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర, నగర మహిళా అధ్యక్షురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గత వైసిపిప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందని, వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. ఒంగోలు నగరాన్ని సమగ్ర ప్రణాళికతో సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 'సుపరిపానలో తొలి అడుగు'కు ఒంగోలు నియోజకవర్గంలో విశేష స్పందన లభిస్తోందన్నారు. ఏడాది పాలనలో అభివృద్ధిలో ఒంగోలు రూపురేఖలు మారాయంటూ మహిళలు చెబుతున్న మాటలు ఆనందాన్ని ఇస్తున్నాయన్నారు. ప్రజలకు ఏ ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటామని, ఒంగోలు నగర ప్రజల దాహార్తిని తీర్చే తాగునీటి పథకాన్ని త్వరలో ప్రారంభిస్తామ న్నారు. డివిజన్లలో ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు బండారు మదన్, టిడిపి నాయకులు రాచగర్ల వెంకట్రావు, తాతా ప్రసాద్, పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి, టి.అనంతమ్మ, కుసుమ కుమారి, 29, 29 డివిజన్ల అధ్యక్షులు, టిడిపి నాయకులు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లలో వేగం పెరగాలి

- 20 క్వింటాళ్ల నిల్వలను తక్షణం కొనండి
- కొనుగోలు కేంద్రాలను పెంచండి
- చిన్న రైతులను ఆదుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మార్క్‌ఫెడ్ ద్వారా చేపట్టిన పొగాకు కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. సోమవారం ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 2024-25 సంవత్సరంలో నల్లబర్లీ పొగాకు 80 మిలియన్ కిలోల ఉత్పత్తి అయిందన్నారు. 22 పొగాకు కంపెనీలు 36 మిలియన్ కిలోల పంటను కొనుగోలు చేశాయని అన్నారు. ఈ నెల 21 నుండి సన్న, చిన్న రైతులను దష్టిలో పెట్టుకొని కొనుగోలు యాప్‌లో నమోదు కాబడని పొగాకు రైతులందరికి లబ్ధి చేకూరేలా మార్క్‌ఫెడ్ అధికారులు, సిబ్బంది కొనుగోళ్ల ప్రక్రియను కొనసాగించాలని తెలిపారు. ప్రతి రైతు దగ్గర కేజీ పొగాకు కూడా మిగలడానికి వీల్లేదని, జూలై నెలలో కనిష్టంగా 1 కేజీ నుంచి గరిష్ఠంగా 20 క్వింటాళ్ల పొగాకు వరకు ఉన్న రైతుల వద్ద కొనుగోలు చేయాలన్నారు. చిన్న రైతులకు తోడ్పాటును ఇవ్వటంతో పాటు పెద్ద రైతుల వద్ద కూడా త్వరిగతగిన పొగాకు కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గిడ్డంగులు సరిపోక పోతే ప్రైవేట్ గిడ్డంగులు అద్దెకు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నుండి గిడ్డంగుల ద్వారా పొగాకును తరలించేందుకు రవాణా ఖర్చుల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని కలెక్టర్లు మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే మంత్రి స్పందిస్తూ.. కేంద్రాల నుండి గోడౌన్స్ వరకు అయ్యే రవాణా ఖర్చు వల్ల రైతులు ఇబ్బందులకు గురవ్వకూడదని, ఆ ఖర్చును కూడా మార్క్‌ఫెడ్ భరిస్తుందని కలెక్టర్లకు హామీ ఇచ్చారు. కొనుగోలు యాప్‌లో నమోదైన రైతుల వద్దనే కాకుండా నమోదు కాని రైతుల వద్ద కూడా పొగాకును కొనాలని అధికారులకు తెలిపారు. రేపటి నుండి రైతులకు సమాచారం చేరవేసే పనిలో అధికారులు ఉండాలని, ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు జరగాలని, వచ్చే సోమవారం నుండి నూతన ప్రణాళిక ప్రకారం కొనుగోళ్లు యధావిధిగా జరగాలని మంత్రి తెలిపారు. రానున్న సీజన్‌లో రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయంగా వేరే పంటలను వేయాలని, అందుకు వ్యవసాయ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతులకు అందుబాటులోకి ఎరువులు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 1276 ఆర్ఎస్‌కే, (రైతు సేవా కేంద్రం) పీఏసీఎస్ లలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంటాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఎరువులు వాడకం ఎక్కువ ఉన్న ప్రాంతాలను గుర్తించి మరిన్ని ఆర్ఎస్‌కేల ద్వారా ఎరువులను రైతులకు అందచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేప్దట్టాలని అధికారులకు తెలిపారు. పొగాకు సాగుచేసే ప్రాంతాలైన ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు తమీమ్అన్సారియా, వెంకట మురళి, అరుణ్‌బాబు, గుంటూరు జెసి భార్గవ తేజ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు,వ్యవసాయ శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ బీ. రాజశేఖర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఢిల్లీరావు, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, మార్కెటింగ్ డైరెక్టర్ సునీత, వ్యవసాయ, మార్క్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

అద్దెలు చెల్లించని షాపులకు తాళం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగరంలోని కూరగాయల మార్కెట్‌లో దీర్ఘకాలంగా అద్దెలు చెల్లించని షాపులకు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాలతో కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు సోమవారం తాళాలు వేశారు. మార్కెట్‌లోని 2, 3, 5, 14, 15, 16, 27, 29, 55, 57 నెంబర్ షాపులతో పాటు రిటైల్‌లోని 100వ నెంబర్ షాపులకు తాళాలు వేశారు. అనంతరం 3, 16, 57 షాపుల నిర్వాహకులు కొంత మొత్తం చెల్లించడంతో వాటి వరకు తాళాలు తీశారు. మిగిలిన మొత్తం బకాయి త్వరలో చెల్లించాలని కార్పొరేషన్ అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, ఆర్ఒ విజయభాస్కర్, ఆర్ఐలు కళ్యాణి, శ్రీనివాసులు, క్రాంతి, నిరూప్ పాల్గొన్నారు.

షాపులకు తాళాలు వేస్తున్న అధికారులు

వసతిగృహాల్లో మంత్రి స్వామి తనిఖీ

ప్రజాశక్తి-పొదిలి

పొదిలిలో ఎస్సీ బాలికలు మరియు బాలుర వసతి గహాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాలవీరాంజనేయ స్వామి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం కనిగిరి నియోజకవర్గంలో జరిగిన పలు అభివద్ధి కార్యక్రమాలలో పాల్గొని వస్తూ మార్గమధ్యమైన పొదిలి పట్టణంలో ఎస్సీ హాస్టల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. బాలికల హాస్టల్లో పనులను పరిశీలించి.. అధికారులు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు ఇచ్చారు. పనుల్లో నాణ్యతను పాటించాలన్నారు. విద్యార్థినులతో మమేకమై ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం బాలుర వసతి గహాన్ని తనిఖీ చేసి అక్కడ సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు. వంట రూమును, మరుగుదొడ్లను స్వయంగా మంత్రి పరిశీలించారు. వసతి గహంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు.

పొదిలిలో హాస్టల్‌లో వసతులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

మంత్రి వెంట వెల్ఫేర్ ఈడి వెంకటేశ్వర నాయక్, వార్డెన్ హరిబాబు, పొదిలి మండల పార్టీ కన్వీనర్ అంజిరెడ్డి, గోగినేని వెంకట్రావు, ముని శ్రీను, మర్రిపూడి మండలాల తెలుగుదేశం పార్టీ నా యకులు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి యర్రమోతు శ్రీని వాసులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు తుళ్లూరి నరసింహారావు, వైస్ ఎంపీపీ గొంటు హనుమారెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, పాల్గొన్నారు.

కురిచేడు: కురిచేడులోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను మంత్రి స్వామి పరిశీలించారు. విద్యార్థులను అక్కడ అందిస్తున్న సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజన సదుపాయాలు, విద్య, వసతి తదితర అంశాలపై విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్ రావు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.